

సాయి కుల్వంత్‌లో పాఠశాల సిబ్బంది సంగీత కచేరి

అలరించిన సంగీత కచేరి

నేటి నుంచి జ్ఞాన యజ్ఞం

పుట్టపర్తి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాయి కుల్వంత్‌లో గురువారం సాయంత్రం శ్రీ సత్యసాయి హయ్యర్ సెకండరీ పాఠశాల సిబ్బంది నిర్వహించిన సంగీత, గాన కచేరి భక్తులను అలరించింది. సుమారు గంటపాటు ప్రదర్శన ఇచ్చిన అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. పూర్ణచం ద్ర హాల్‌లో శుక్రవారం వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం ప్రారంభమవుతుంది. ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్స రం నిర్వహించే ఈ యజ్ఞంలో వేలాది మంది భక్తులు పాల్గొంటారు. విజయదశమి రోజున యజ్ఞం ముగుస్తుంది.

కాత్యాయనిగా అమ్మవారు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో గాయత్రీదేవి, సత్యమ్మ దేవతతో పాటు జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలంకరించారు. అనంతరరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాత్యాయని అలంకరణలో గాయత్రీమాత

అ..ఫార్..!

లక్ష్యానికి దూరంగా అపార్ నమోదు

జిల్లాలో ఇంకా 76,150 మందికి పెండింగ్

ఆధార్, బర్త్ సరిఫికెట్లలో తప్పులతో తిప్పలు

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

కొత్తచెరువు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదులో ఎన్నో చిక్కులు ఎదురవుతున్నాయి. ఆధార్, జనన ధ్రువీకరణ తదితర పత్రాల్లో తప్పులు.. అపార్ నమోదుకు అడ్డంకులుగా మారుతున్నాయి. వాటిని సవరించుకోవడంలో తీవ్ర జాప్యమవుతోంది. దీంతో అపార్ నమోదు మరింత ఆలస్యమవుతోంది. నేటికీ జిల్లాలో 76,150 మంది విద్యార్థుల అపార్ నమోదు పెండింగ్‌లో ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



అపార్ కార్డు కోసం ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్న విద్యార్థి (ఫైల్)

జిల్లాలో డివిజన్ల వారీగా అపార్ నమోదు వివరాలు ఇలా..

డివిజన్	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	అపార్‌కార్డు జనరేట్ అయిన విద్యార్థులు	జనరేట్ కాని వారు	శాతం
పుట్టపర్తి	461	43,415	33,258	10,157	76.60
ధర్మవరం	521	61,441	46,305	15,136	75.36
కదిరి	561	46,824	32,227	14,597	68.83
పెనుకొండ	1,031	1,25,905	89,645	36,260	71.20

సరిఫికెట్లలో తప్పుల కారణంగానే..

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానంలో భాగంగా వన్ నేషన్.. వన్ స్టూడెంట్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో విద్యార్థులకు ఆధార్ తరహాలో అపార్ కార్డులను అందజేయనుంది. ఈ క్రమంలో గతేడాది అక్టోబరులో దేశంలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ కార్డు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని చాలామంది విద్యార్థుల ఆధార్ కార్డుల్లో వివరాలు తప్పుగా ఉండడం, జనన ధ్రువపత్రాలు లేకపోవడం తదితరాలు ఇబ్బందికరంగా మారాయి. దీంతో అపార్ కార్డు పొందేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో దాదాపు 25 శాతం పాఠశాలల్లోని రికార్డుల్లో విద్యార్థుల పేర్లు ఒకలా, ఆధార్ కార్డులో మరోలా ఉన్నాయంటున్నారు. తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీలు వంటి వాటిలో ఎక్కువగా తప్పులు ఉంటున్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. చేసేదిలేక ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. వందశాతం పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల కారణంగా అపార్ నమోదు ప్రక్రియ ముందుకు సాగడంలేదని తెలుస్తోంది.

ఇంకా 76,150 మందికి పెండింగ్

జిల్లావ్యాప్తంగా 1 నుంచి పదో తరగతి వరకు 2,556 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 2,77,585 మంది చదువుతున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 2,01,435 మంది విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్ అయిందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. 72.57 శాతం నమోదు కాగా.. ఇంకా 76,150 మందికి అపార్ ఐడీ జనరేట్ కావాల్సి ఉందంటున్నారు.

బహుళ ప్రయోజనాలు

అపార్ కార్డు విద్యార్థులకు భవిష్యత్తులో కీలకం కానుంది. ఇందులో విద్యార్థుల పేరు,పుట్టిన తేదీ, ఫొటో, క్యూఆర్ కోడ్‌తో 12 అంకెల అపార్ కార్డు విద్యార్థుల జీవితకాల ఐడీగా ఉపయోగపడనుంది. తద్వారా విద్యార్థులు అకడమిక్ రికార్డులను దేశ వ్యాప్తంగా ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా పొందవచ్చు. ఇందులో విద్యార్థుల పూర్తి వివరాలతో పాటు మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాలు, క్రీడల్లో ప్రతిభ తదితర వివరాలు ఉంటాయి. విద్యార్థి అపార్ కార్డు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే.. వారికి సంబంధించి పూర్తి వివరాలు ప్రత్యక్షమవుతాయి. దీని ఆధారంగా మార్కుల జాబితాలు, టీసీ, ప్రవేశాలు తదితర పూర్తి వివరాలు పొందవచ్చు. అలా విద్యార్థులకు భవిష్యత్తులో అపార్ ఎంతో కీలకం కానుంది.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం: కిష్టప్ప, డీఈఓ

అపార్ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు పడుతున్న ఆధార్ సమస్యలు, ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆధార్ నమోదు చేపడుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 72.57 శాతానికిపైగా అపార్ నమోదైంది. కళాశాల విద్యార్థులకు ఆధార్ కార్డుల్లో పేర్లు, పుట్టిన తేదీల మార్పునకు 10వ తరగతి మార్కుల జాబితా సరిపోతుంది. అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలని పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు సూచించాం.

వచ్చేశాయ్.. ఉద్యోగాలు..!

అమరావతిలో నియామకపత్రాలు

మెగా డీఎస్సీ సభ విజయవంతం



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులను అభినందిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే దగ్గుపాటి 5

ఇంధన ల్యాండ్‌మార్క్‌గా సత్యసాయి

- కలెక్టర్ శ్యాంప్రసాద్
- రామగిరిలో 300 మెగావాట్ల సోలార్‌విద్యుత్ ప్రాజెక్టు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ 5

రోజుకు ఓ గంట శ్రమించండి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



చీపురు పట్టి శుభ్రం చేస్తున్న కలెక్టర్

హిందూపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట శ్రమించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. హిందూపురం హౌసింగ్ బోర్డులోని ఎన్టీఆర్ పార్కువద్ద మునిసిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ఏక్ దిన్ - ఏక్ ఘంట - ఏక్ సాథ్' కార్యక్రమంలో ఆయన శ్రమదానం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, మొక్కలను నాటి సంరక్షించాలని ప్రజలను కోరారు. దేశ వ్యాప్తంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం ఈ నెల 17నుంచి అక్టోబరు 2వరకు జరుగుతోందని తెలిపారు. తెలుగు యువత ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి వారం స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిస్తున్న యువకులకు కలెక్టర్ టీషర్ట్‌లను అందించారు. అనంతరం కలెక్టర్ ఇళ్ల వద్దకు వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పీఏ వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, మెప్మా అధికారి గంగులయ్య, నాయకులు నాగరాజు, సుమోశీన, సురేష్, అమీన్, డైమండ్‌బాబా, భార్గవ్, చింటు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సూగూరులో పీఎం సూర్యఘర్ పథకం కింద నర్మద అనే మహిళ తన ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. హిందూపురాన్ని సోలార్ పురంగా మార్చుదామని పిలుపునిచ్చారు.

గ్యాస్ సబ్సిడీ సమస్యను పరిష్కరించండి

ఏజెన్సీలకు జేసీ అభిషేక్ కుమార్ ఆదేశం

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపం-2 పథకం కింద సబ్సిడీ జమ కాని వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్యాస్ ఏజెన్సీలను జేసీ అభిషేక్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో దీపం పథకం సబ్సిడీ సమస్యలపై పౌర సరఫరాల శాఖ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. నగదు జమకాని లబ్ధిదారుల వివరాలను పరిశీలించాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని, నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ

నాడు



కాలువలో పెరిగిపోయిన పూడిక, కంప చెట్లు (నాడు)

ఇది హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పథకంలోని మడకశిర బ్రాంచి కాలువ. మడకశిర మండలం గొల్లపల్లి సమీపంలోని పంపుహౌస్ వద్ద కాలువలో కంపచెట్లు పెరిగిపోయి, పూడిక పేరుకుపోయి నీరు పారే పరిస్థితి ఉండేది కాదు. గత వైసీపీ పాలకులు ఐదేళ్లలో మరమ్మతుల ఊసే మరిచారు. దీంతో కాలువకు ఈ దుస్థితి దాపురించింది. పేరుకుపోయిన పూడిక కారణంగానే కాలువ పొడవునా గండ్లు పడేవి. దీంతో చివరి చెరువుకు నీరు చేరేది కాదు. రైతులు తీవ్రంగా నష్టపోయేవారు.

కాలువలకు మహర్దశ



కాలువలో కంపచెట్లు, పూడిక పేరుకుపోయి వర్షాలు కురిసినా నీరు నిలిచేది కాదు. ప్రస్తుతం కంప చెట్లు, పూడిక తొలగించడంతో వర్షపు నీరు వృఽథాగా పోకుండా కాలువలో నిలువ ఉంటోంది. ఈ కారణంగా భూగర్భ జలాలు పెంపొంది, బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతోంది.

- రైతు జయన్న, చిట్నడుకు

70 శాతం పూర్తి

కేతేపల్లి నుంచి అమరాపురం వరకు హంద్రీనీవా కాలువలో పూడిక, కంపచెట్ల తొలగింపు పనులకు రూ.87లక్షలు మంజూరయ్యాయి. 70 శాతం పనులు పూర్తయ్యాయి. వారంలోగా కృష్ణా జలాలు మడకశిర చెరువులకు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం లేపాక్షి వరకు నీరు చేరింది.

- నాగార్జున, హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈ

నేడు



కాలువలో కంపచెట్లు, పూడిక తొలగించిన దృశ్యం

కూటమి అధికారం చేపట్టగానే కాలువ మరమ్మతులపై దృష్టి పెట్టింది. జిల్లాలో కాలువల మరమ్మతులకు రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో శరవేగంగా పనులు చేస్తున్నారు. దాదాపు 75 శాతం ఇప్పటికే పూర్తయ్యాయి. మరమ్మతులు చేపట్టాక గొల్లపల్లి పంప్‌హౌస్ వద్ద కాలువ ఇలా కొత్త కళను సంతరించుకుంది. పూడిక తొలగించడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువకు కొత్త కళ..

హంద్రీనీవా కాలువల్లో రూ.5కోట్లతో మరమ్మతులు


- శరవేగంగా పూడిక, చెట్ల తొలగింపు పనులు
- 75 శాతం పూర్తి
- చివరి చెరువుకూ చేరనున్న కృష్ణాజలాలు
- అన్నదాతల హర్షం

మడకశిర, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువపై గత వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చూపారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో కాలువకు నీరు వదిలినా గండ్లు పడి వృథా అయ్యేది. మరమ్మతుల కోసం అప్పట్లో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. కాలువల్లో కంపచెట్లు పెరిగిపోయి, పూడిక పేరుకుపోయింది. కేతేపల్లి నుంచి అమరాపురం వరకు కూటమి అధికారంలోకి వచ్చాక 65 కిలోమీటర్ల కాలువ మరమ్మతులకు రూ.87లక్షలు మంజూరయ్యాయి. పనులు శరవేగంగా జరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 70శాతం మేర పనులు పూర్తయ్యాయి. వర్షాలు కురిసినపుడు నీరు హంద్రీనీవా కాలువల్లో నిలబడడంతో భూగర్భజలాలు పెంపొంది, బోరుబావుల్లో నీరు పుష్కలంగా పెరిగేది. తాగు, సాగునీటికి సమస్య ఉండదని రైతులు అంటున్నారు. మడకశిర బ్రాంచి కెనాల్ గుడిబండ వరకు తవ్వారు. కూటమి అధికారం చేపట్టాక కాలువల్లో మరమ్మతులు చేయాలని నిర్ణయించింది.

పూడిక, కంప చెట్లు తొలగించడానికి జిల్లాకు రూ.ఐదు కోట్లకిపైగా నిధులు మంజూరు చేసింది. అందులో మడకశిర నియోజకర్గానికి రూ.1.32 కోట్లు, పెనుకుండకు రూ.1.80 కోట్లు, హిందూపురానికి రూ.1.65 కోట్లు, కదిరికి రూ.35 లక్షలు కేటాయించారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెల నుంచి గొల్లపల్లి రిజర్వాయర్, అక్కడి నుంచి పెనుకొండ, సోమందేపల్లి, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి, మడకశిర, జంబలబండ వరకు హంద్రీనీవా కాలువ తవ్వారు. పనులు పూర్తవడంతో లేపాక్షి వరకు నీరు వస్తోంది. వారంరోజుల్లో మడకశిరకు కృష్ణాజలాలు చేరుతాయని అధికారులు చెబుతున్నారు.

సరిచేస్తారా..? సరిపెడతారా..?

- పురం ఓటర్లతో ఆడుకున్న వైసీపీ
- గెలుపే ధ్యేయంగా జాబితా మార్పిడి
- దూర ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో పేర్లు
- మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీకి భారీ నష్టం



హిందూపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఎన్నికలు జరిగేలోగా ఓటరు జాబితాను సరిచేస్తారా..? పాత జాబితాతోనే ముందుకు వెళతారా..? అన్న చర్చ మొదలైంది. గెలుపే ధ్యేయంగా గత ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఓటరు జాబితాను ఇష్టారాజ్యంగా మార్పించారు. మున్సిపాలిటీలోని ఓటర్లను అడ్డంగా చీల్చి.. ఒకే కుటుంబానికి చెందినవారిని వేర్వేరు వార్డులలో చేర్పించారు. స్థానిక ఎన్నికలు సమీపించడంతో ఇప్పుడైనా ఆ తప్పులను సరిదిద్దాలని పురం ఓటర్లు కోరుతున్నారు. నివసిస్తున్న ప్రాంతాలకు దగ్గరలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో తమ పేర్లను చేర్చాలని విన్నవిస్తున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సుమారు 10 వేల మంది ఓటర్లను వైసీపీ నాయకులు వార్డుల ప రిధిలో అటూ ఇటు మార్పించారు. దీంతో చాలా మంది అప్పట్లో ఓటుహక్కును వినియోగించుకోలేదు. ఇది వైసీపీ అభ్యర్థులకు బాగా కలిసొచ్చింది.

ఎందరో బాధితులు..

- హిందూపురం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ 2వ వార్డు పరిధిలోకి వస్తుంది. ఇక్కడి ఓటర్లలో చాలామందిని 3, 4 వార్డుల్లోకి బదిలీ చేశారు. దీంతో చౌడేశ్వరి కాలనీ నుంచి ఆర్టీసీ కాలనీలో ఉన్న పోలింగ్ కేంద్రానికి రావాలంటే 3 కి.మీ. ప్రయాణించాలి. అంత దూరం వెళ్లడం ఇష్టంలేక చాలా మంది వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోలేదు.
- కోట ప్రాంతం 17వ వార్డు పరిధిలో ఉంది. ఇక్కడి ఓటర్లను రహమత్‌పురం ప్రాంతానికి బదిలీ చేశారు. సిల్కు కాలనీలో ఉన్న కొంతమంది ఓటర్లను మోడల్ కాలనీ, శ్రీకంఠపురం ప్రాంతానికి మార్చారు. మరీ దారుణం ఏమిటంటే.. సడ్లపల్లిలో ఉన్న ఓటర్లను సింగిరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రాలకు బదిలీ చేశారు.
- డీఆర్ కాలనీలో ఓ కుటుంబం నివసిస్తోంది. వారి ఇంట్లో పది ఓట్లు ఉన్నాయి. అందులో మూడు ఓట్లను సీపీఐ కాలనీకి, మరో మూడు ఓట్లు హస్నాబాద్‌కు, మిగిలిన నాలుగు ఓట్లను ఎస్‌డీజీఎస్ కళాశాలలోని పోలింగ్ కేంద్రానికి బదిలీ చేశారు. దీనివల్ల ఆ ఇంట్లో ఐదుగురు మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

టీడీపీ టార్గెట్‌గా విభజన

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓటర్లను టార్గెట్ చేస్తూ, అప్పట్లో విభజన చేశారు. కొన్ని ఓట్లను రద్దు చేయించారు. మరికొన్ని ఓట్లను ఇతర వార్డుల్లోకి చేర్పించారు. పట్టణంలో 7వేల నుంచి 10వేల మంది ఓటర్లను దూర ప్రాంత పోలింగ్ కేంద్రాలకు బదిలీ చేశారని టీడీపీ నాయకులు అప్పట్లో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం వాటిని సరిదిద్దాలని కోరుతున్నారు. హిందూపురంలో ప్రస్తుతం 1,30,274 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 64,966 మంది, మహిళలు 65,294 మంది, ఇతరులు 14 మంది. మున్సిపాలిటీలో 38వార్డులు ఉన్నాయి.

త్రివిక్రమావతారంలో ఖాద్రీశుడు



త్రివిక్రమావతారంలో శ్రీవారు

కదిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కదిరి లక్ష్మీనరసింహస్వామి గురువారం త్రివిక్రమావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం త్రివిక్రమావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు.

వచ్చేశాయ్.. ఉద్యోగాలు..!

- అమరావతిలో నియామకపత్రాలు
- మెగా డీఎస్సీ సభ విజయవంతం

అనంతపురం విద్య, క్రైం, రాప్తాడు, పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో అమరావతిలో గురువారం నియామక పత్రాలను అందజేశారు. సభ విజయవంతం కావడంతో జిల్లా విద్యాశాఖ హర్షం వ్యక్తం చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి 45 బస్సులలో అభ్యర్థులను, వారి కుటుంబ సభ్యులను అమరావతికి తీసుకెళ్లారు. దాదాపు 2వేల మంది అమరావతికి వెళ్లారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సందేశాలను సంతోషంగా విన్నారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఎస్సీ అభ్యర్థి నవీన్ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూర, జేసీ అశ్మిత్ రెడ్డి తదితరులు తమ తమ నియోజకవర్గ అభ్యర్థులకు అభినందలు తెలుపుతూ సందడిగా గడిపారు. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా కార్యక్రమం ముగిసిందని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీ కోసం ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కళ్లలో అసలైన ఆనందం ఇప్పుడే చూస్తున్నామని ఎమ్మెల్యేలు అన్నారు. నూతన ఉపాధ్యాయులకు ఆమె అమరావతిలో నియామక పత్రాలను అందజేసి, అభినందించారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మెగా డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేశారని అన్నారు.



నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర, హాజరైన ఎమ్మెల్యేలు



కొత్త ఉపాధ్యాయులకు డీఎస్సీ నియామక పత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



మెగా డీఎస్సీ సభలో అనంతపురం జిల్లా అభ్యర్థులు

క్రైం కార్నర్

రూ.10 లక్షలు చోరీ



బాధితురాలు గీతమ్మ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుమారుడి చదువు కోసం ఇంట్లో దాచుకున్న సొమ్ము, బంగారం చోరీ అయినట్లు బాధితురాలు గీతమ్మ గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు గీతమ్మ తెలిపిన మేరకు.. తాను తన భర్త సూర్యనారాయణ చేనేత వృత్తి చేసుకుంటూ లక్ష్మీచెన్నకేశవపురంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఇంటర్ పూర్తయిన తమ కుమారుడి ఉన్నత విద్య కోసం అప్పులు చేసి, చీరల వ్యాపారంలో వచ్చిన డబ్బులు రూ.10లక్షల సమకూర్చి ఇంటిలో పెట్టుకున్నామన్నారు. ఈనెల 23న తమ కుమారుడిని కళాశాలలో చేర్పించడానికి తన భర్త సూర్యనారాయణ గుంటూరుకు వెళ్లాడన్నారు. మరుసటి రోజు తాను ఇంటికి తాళం వేసి గోరంట్లకు వెళ్లినట్లు తెలిపారు. అయితే గురువారం మా ఇంటి చుట్టు పక్కన ఉండేవాళ్లు ఫోన్ చేసి 'మీ ఇంటితాళాలు పగలగొట్టినట్లు ఉందని' సమాచారం ఇచ్చారు. దీంతో తాను హుటాహుటిన ధర్మవరంలోని ఇంటికి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. బీరువాలో ఉంచిన రూ. 10లక్షల నగదు, మూడు జతల బంగారు కమ్మలు, చేతి ఉంగరం సుమారు తులం బంగారం చోరీ జరిగినట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన ఆర్థిక సమస్యలు



తిప్పేస్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాచప్పబావి కాలనీకి చెందిన తిప్పేస్వామి (34) ఆర్థిక సమస్యలతో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంట గ్రామానికి చెందిన తిప్పేస్వామి ఎక్సకవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి భార్య గీతాంజలి, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడేవాడు. ఈక్రమంలో తీవ్రంగా కుంగిపోయాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన భార్య గీతాంజలి ఉరికి వేలాడుతున్న భర్త తిప్పేస్వామిని చూసి బోరున విలపించారు. కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, తాటిచెర్ల రైల్వే స్టేషన్ మధ్యలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో గుత్తి మీదుగా బెంగళూరు వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463) రైలు కింద పడి 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు గల వ్యక్తి మృతి చెందాడన్నారు. సంఘటన స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ దామోదర్ తెలిపారు. వివరాలు తెలిసిన వారు 7013308693ని సంప్రదించాలని సూచించారు.

కార్మికులకు బీమా చేయండి

- పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ ఆదేశం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీ కార్మికులు, క్లాప్ మిత్రలకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పోస్టల్ మ్యూచువల్ ఇన్స్యూరెన్స్ చెల్లించాలని డీపీఓ నాగరాజునాయుడు ఆదేశించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన కార్మికుల బీమాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా బీమాను అమలు చేయాలని ఆదేశించారు. అందుకు కావాల్సిన నిధుల కోసం పంచాయతీలో తీర్మానం చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులు వినియోగించుకొని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఓపెన్‌స్కూళ్లు అడ్మిషన్ల గడువు పొడిగింపు

అనంతపురంవిద్య, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్‌స్కూళ్ల)అడ్మిషన్లకు ఈనెల 31వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం తెలిపారు. పదోతరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు చేసుకోవాలంటే రూ.200లు అపరాధ రుసుం చెల్లించి చేరవచ్చన్నారు.

బంగారు తల్లీ.. నిన్నెలా వదిలేశారే..?



దొరికిన శిశువు

అనంతపురంవైద్యం/ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డను చెత్తకుప్పల పాల్జేసిన సంఘటన గురువారం తెల్లవారుజామున నగరంలో వెలుగుచూసింది. కేకలు విన్న స్థానికులు చిన్నారిని చేరదీసి, సపర్యలు చేసి, అధికారులకు అప్పగించారు. జిల్లాకేంద్రంలోని సాయినగర్ ఏడో క్రాస్‌లో గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఓ చెత్త సంచి నుంచి చిన్నారి కేకలు వినిపించాయి. ఈ ఏడుపు విన్న చుట్టుపక్కల ప్రాంత మహిళలు ఆ సంచిని తెరిచి చూడగా పసికందు కనిపించింది. బొడ్డు తాడు కూడా కోయని ఆ చిన్నారిని చూసి వారు చలించిపోయారు. చిన్నారిని చేరదీసి, సపర్యలు చేసి, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడకు చేరుకొని చిన్నారిని ప్రభుత్వసర్వజన వైద్యశాలకు తరలించారు. మూడు రోజులు పర్యవేక్షణలో ఉంచాలని వైద్యులు తెలిపారు.

పాపాయి మాకే కావాలి

చెత్త సంచిలో ఉన్న శిశువు పట్ల కొందరు స్థానిక మహిళలు మమకారం చూపించారు. ముద్దు బొద్దుగా ఉన్న ఆ పాపాయిని ఇస్తే, పెంచుకుంటామని పోటీపడ్డారు. పాపను తీసుకెళ్లేందుకు వచ్చిన అధికారులను సైతం ప్రాధేయపడ్డారు. అయితే అధికారులు నిబంధనల మేరకు దత్తత తీసుకోవాల్సి ఉంటుందని చిన్నారిని తీసుకెళ్లారు.

ఇంధన ల్యాండ్‌మార్క్‌గా సత్యసాయి

- కలెక్టర్ శ్యాంప్రసాద్
- రామగిరిలో 300 మెగావాట్ల సోలార్‌విద్యుత్ ప్రాజెక్టు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



సోలార్ ప్రాజెక్టు శంకుస్థాపనలో కలెక్టర్ తదితరులు

రామగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఇంధనం విషయంలో శ్రీసత్యసాయి జిల్లాను ప్రపంచంలోనే ఒక ల్యాండ్‌మార్క్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గురువారం మధ్యాహ్నం రాజస్థాన్ రాష్ట్రం బాన్సువార నుంచి వర్చువల్‌గా రామగిరిలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రామగిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు రాబోయే రోజుల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పునరుత్పాదక ఇంధనంలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందన్నారు. రామగిరిలో 1047ఎకరాలలో 300మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం సంతోషదాయకమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు విజనరీ లీడర్ అని, ఆయన ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మన రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకుపోవడానికి సీఎం చంద్రబాబుకు మనమందరం తోడ్పాటు అందించాలని అవసరం ఉందన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీలో మన రాష్ట్రం పయనీరుగా ఉంది. ఇప్పటివరకు రాష్ట్రం మొత్తంమీద దాదాపు 5వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇంధనంలో ప్రపంచంలోనే శ్రీసత్యసాయి జిల్లా ఒక ల్యాండ్‌మార్క్‌గా మారేందుకు కృషి చేస్తున్నామన్నారు. బొగ్గు ఆధారిత విద్యుత్‌తో పోలిస్తే క్లీన్‌అండ్ గ్రీన్ ఎనర్జీ పర్యావరణానికి ఎంతో మేలు కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా సోలార్ ఏర్పాటులో కృషిచేసిన అచీవర్స్‌కు కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందజేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో సెకీ వీసీఅండ్ ఎండీ కమలాకర్‌బాబు, ఆర్డీఓ మహేష్, సెకీ ఈడీ శివశంకర్‌నాయుడు, తహసీల్దార్ రవికుమార్‌తో పాటు పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: డీఎంఈ



మాట్లాడుతున్న సీనియర్ డీఎంఈ రమేష్

గుత్తి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్ పేర్కొన్నారు. గుత్తిఆర్ఎస్‌లో రైల్వే ఇనిస్టిట్యూట్ క్రీడామైదానంలో అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. గౌతమి పూరి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీటీ, రైల్వే ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రేమ్, సూరి మెమోరియల్ టోర్నమెంట్‌ను డీఎంఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మీయా, ఎస్ఐ సురేష్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దివంగత క్రీడాకారులు ప్రేమ్, సూరి మెమోరియల్ టోర్నమెంట్‌ను వారి జ్ఞాపకార్థం స్నేహితులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. టోర్నమెంట్‌లో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, రాజా, నవీన్, గిరిబాబు, డాడి, ప్రసాద్, హరినాథ్‌రెడ్డి, చాంద్, విజయ్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల కోసం రూ. 90 కోట్లు ఇవ్వండి

- మంత్రులను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం/ క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ. 90 కోట్లు నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం గురువారం ఆమె మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్‌లను వారి కార్యాలయాల్లో కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అనంతపురం బైపాస్ నుంచి కనగానపల్లి రోడ్డు, కనగానపల్లి నుంచి చిగురుచెట్టు రోడ్డు, ధర్మవరం నుంచి కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు, పంగల్‌రోడ్డు సమీపం నుంచి చిగిచెర్లకు వెళ్లే రోడ్డు బాగా దెబ్బతిన్నాయని నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. రాప్తాడు నియోజకవర్గంలో 5 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో న్యామద్దల, మద్దలచెరువు, దాదులూరు, సోమలదొడ్డి, ఆలమూరు గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. తన విజ్ఞప్తులపై మంత్రులు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యాసాధ్యాలు పరిశీలించి వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి రూ.13వేలు పలికాయన్నారు.

గడువు పొడిగింపు

లేపాక్షి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో ఖాళీగా ఉన్న 9, 11 తరగతుల సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి గడువు అక్టోబరు 7వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. గతంలో ప్రవేశం కోసం సెప్టెంబరు 24వరకు ఉండేదని దానిని పొడిగించినట్లు తెలిపారు.

పుట్లూరు, యల్లనూరుకు సాగునీరు ఇవ్వాలి

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్‌గోపాల్‌రెడ్డి

పుట్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలోని పుట్లూరు, యల్లనూరు మండలాలకు తాగు, సాగునీటిని ఇవ్వాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోని శాసనమండలిలో గురువారం ఆయన మాట్లాడుతూ రెండు మండలాల్లో సుమారు 80వేల ఎకరాల్లో పండ్ల తోటలు ఉన్నాయన్నారు. వీటిలో చీనీ, అరటి, మామిడి, సపోట తదితర ఉద్యాన పంటలు అధికంగా ఉన్నాయన్నారు. ఈ మండలాలకు రావాల్సిన హెచ్చెల్సీ నీరు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిత్రావతి నదిపై రిజర్వాయర్ ఉన్నప్పటికి నీరు పారక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి పుట్లూరు చెరువుకు అక్కడి నుంచి సుబ్బరాయసాగర్‌కు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోతల ద్వారా కేటాయించాలని విన్నవించారు. దీంతో ఆ రెండు మండలాలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు.

ఎస్ఎస్‌బీఎన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు జాతీయ పతకాలు



పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను సన్మానిస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో తమ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు పతకాలు దక్కినట్లు ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ అధికారి ప్రొఫెసర్ మురళి గురువారం తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన 8వ అఖిలభారత థాల్ సైనిక్ క్యాంపులో జిల్లాకు చెందిన ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు కృష్ణ, కిరణ్, నానివాదన్‌లు అత్యంత ప్రతిభ కనబరిచి రజత పతకాలు సాధించినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లను గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ది బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సీఈఓ దేవకుమార్, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గల్లా హర్ష, భవాని రవికుమార్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి కె శాంతరాజ్, రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో గురువారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.16, కనిష్ఠంగా రూ.8, సరాసరి రూ.12తో తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు 3,150టన్నుల టమోటాల వచ్చినట్లు పేర్కొన్నారు.

హైటెక్ పద్ధతిలో మద్యం అక్రమ రవాణా

- వందల కిలోమీటర్లు ఛేజ్ చేసి పట్టుకున్నాం
- జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ చంద్రశేఖర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



అనంతపురం క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): 'ముందు వెళ్తున్న వాహనంలోని వ్యక్తులు వాకీటాకీలతో ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తారు. దీని వెనుక వస్తున్న వాహనంలో ఉన్న వ్యక్తులు ముందున్న వారిచ్చే సూచనల మేరకు మద్యాన్ని అక్రమంగా జిల్లాకు రవాణా చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో గోవా అక్రమ మద్యం రవాణా కేసు ఛేదింపు వెనుక ఉన్న విస్తుగొలిపే విషయాలు, గంజాయి నియంత్రణకు చేపడుతున్న చర్యలపై స్పందించారు.

ప్రశ్న: ఎప్పటి నుంచి గోవా అక్రమ మద్యం రవాణాపై నిఘా పెట్టారు..?

ఏసీ: మద్యాన్ని గోవా నుంచి తెచ్చి కడప జిల్లా ప్రొద్దుటూరులో అమ్ముతున్నారు. గోవా మద్యం అక్రమ రవాణ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు వీరేంద్రపై నిఘా పెట్టాం. మొదట అతడి నుంచి మద్యం కొంటున్నవారిని ఆరా తీశాం. తర్వాత వారు వెళ్లే వాహనాల కోసం టోల్‌ప్లాజాల్లో కూడా వెతికాం. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోడానికే సుమారు ఆరు మాసాల నుంచి నిఘా ఉంచాం.

ప్రశ్న: గోవా నుంచి ఇక్కడకు ఎలా తెస్తున్నారు..?

ఏసీ: గోవా నుంచి లిక్కర్‌ను జిల్లా సరిహద్దుల్లోకి తెచ్చి, తర్వాత కడప జిల్లా ప్రొద్దుటూరు చేర్చడం వాళ్ల లక్ష్యం. గోవాలోని మపూస బీచ్ ఏరియాలో లిక్కర్ కొంటారు. అక్కడి నుంచి హెబెకవాడి టోల్‌ప్లాజా మీదుగా చెల్లగిరి, హెబ్బాల్ మీదుగా కుందుర్పి సమీపంలో అనంతపురం జిల్లాలోకి వస్తారు. తర్వాత కళ్యాణదుర్గం, వడ్డుపల్లి, అనంతపురం, తాడిపత్రి, ముద్దనూరు మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుని అక్కడ విక్రయిస్తారు.

ప్రశ్న: మద్యం రవాణా ముఠా సభ్యులు ఎలా తప్పించుకుంటారు..?

ఏసీ: గోవా అక్రమ మద్యం రవాణాలో వీరేంద్ర కీలక నిందితుడు. ఇతడిపై ఎక్సైజ్, పోలీసు కేసులే 10 వరకూ ఉన్నాయి. హైదరాబాద్‌లోని కోఠిలో వాకీటాకీలు కొన్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేని చోట వీటిని హైటెక్ పద్ధతిలో ఉపయోగిస్తారు. ముందు వెళ్తున్న పైలెట్ వాహనంలోని వ్యక్తులు వాకీటాకీలతో వెనుక వచ్చే వాహనంలోని వారికి సమాచారం ఇస్తారు. దీని ఆధారంగా పోలీసుల కళ్లుగప్పి మద్యం రవాణా చేస్తారు.

ప్రశ్న: వీళ్లు ఎన్నేళ్ల నుంచి మద్యం అక్రమ రవాణా చేస్తున్నారు..?

ఏసీ: కీలక నిందితుడైన వీరేంద్ర, సుమారు ఐదేళ్లుగా చేస్తున్నాడు. గతంలో 10 నెలలు జైలుకు కూడా వెళ్లివచ్చాడు. ఇన్నోవాతోపాటు, మరో వాహనం తీసుకుని, మరికొందరిని పెట్టుకుని అక్రమంగా గోవా మద్యం రవాణా చేస్తున్నాడు. ఈ బిజినెస్ లేనప్పుడు హైదరా బాద్‌లో ర్యాపిడో డ్రైవర్‌గా కూడా వెళ్తాడు.

ప్రశ్న: ఈ ముఠా సభ్యులు ఎంత అక్రమ మద్యం రవాణా చేస్తారు..?

ఏసీ: మామూలుగా 70 బాక్సుల్లో లిక్కర్ తెచ్చేవాళ్లు. ఈసారి దసరా పండుగా ఉందని 110 బాక్సుల్లో తీసుకొచ్చారు. ఈ నెల 22న టోల్ ప్లాజా వద్ద కూడా వెహికల్స్ వెళ్లడం సీసీ కెమెరాల్లో గుర్తించి, నిఘా పెట్టాం.

ప్రశ్న: ఎలా ఛేజ్ చేశారు....? ఎన్ని కిలోమీటర్లు వెంబడించారు..?

ఏసీ: వడ్డుపల్లి టోల్‌ప్లాజా వద్ద రెండు వెహికల్స్ రాగానే గుర్తించాం. మా డిపార్టుమెంట్ వాళ్లను చూడగానే...ఇన్నోవా వాహనం వెనక్కు తిప్పి పరుగు తీశారు. మా టీం వెంబడించింది. సుమారు 200 నుంచి 300 కిలోమీటర్లు తిరిగి పట్టేశాం.

ప్రశ్న: కొందరు విద్యార్థుల్లో పెరిగిన గంజాయి వాడకాన్ని ఎలా అరికడతారు?

ఏసీ: కొన్ని చోట్ల కొందరు ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ విద్యార్థులు వాడుతున్నట్టు గుర్తించాం. ఎవరు వాడినా ఇది చాలా ప్రమాదకరం. విద్యార్థులు, వాళ్ల తల్లిదండ్రులకు సైతం అవేర్‌నెస్ మీటింగ్స్ పెట్టి...అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

రాయల విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

అమడగూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మహమ్మదాబాద్ మూడు రోడ్ల కూడలిలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు గురువారం బలిజ కులస్థులు భూమి పూజ చేశారు. బలిజ సంఘం మండలాధ్యక్షుడు గోపాల్, నాయకులు క్రిష్ణమూర్తి, శేషు, సింగల్ విండో ప్రెసిండెంట్ నరేష్, చిన్నప్ప, జయప్ప, కాడా సిద్దు, భాస్కర్, రమేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

అమడగూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌకల కొత్తపల్లి రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం గురువారం రైతులు క్యూకట్టారు. కాగా యూరియా అవసరమైన రైతులు మాత్రమే తీసుకోవాలని ఏఓ వెంకటరమణాచారి సూచించారు. పంటలు సాగుచేయని రైతులు తీసుకోవడం సరికాదన్నారు. అలాగే యూరియా ఎక్కువగా వాడకం వల్ల అనేక నష్టాలు కలుగుతాయన్నారు. యూరియాకు బదులుగా నానో యూరి యాను వాడుకోవచ్చని ఏఓ తెలిపారు. ఆయనతో పాటు ఏఈఓ రమేష్‌నాయక్, ఎంపీఈఓ అరవిందు, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

తనకల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి వద్ద రైతు హైదర్‌వలి సాగుచేసిన వేరుశనగ పంటను వ్యవసాయ శాఖ కదిరి ఏడీ సనావుల్లా, ఏఓ భారతి గురువారం పరిశీలించారు. జనజాగృతి, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతులకు రైతు సంఘాల ద్వారా 1694 వేరుశనగ కాయలను ఉచితంగా అందించారు. వారు సాగుచేసిన పంటను ఏడీ పరిశీలించారు. అనంతరం కోటపల్లి సచివాలయంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. జనజాగృతి వ్యవసాయాధికారి గరుడప్ప, చంద్రమోహన్, కిరణ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ పలువురు రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆంధ్రజ్యోతి స్పందన

ధర్మవరంరూరల్, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లి ఎస్సీకాలనీలో తాగునీటి సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపారు. కొంతకాలంగా ఎస్సీకాలనీ ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'నీళ్ల తిప్పలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు గ్రామానికి వెళ్లారు. ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ ఏలూరి వెంకటేష్, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ కాలనీలో నూతన బోరువేయించి కొళాయిలకు నీటి సరఫరా చేయడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో కాలనీప్రజలు అధికారులకు, సర్పంచ్‌కు, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి మృతి



రవీంద్ర (ఫైల్)

కదిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం ఓబులరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రవీంద్ర (29) మిద్దెపైకి ఎక్కుతూ, మెట్లపై నుంచి జారి పడి మృతి చెందాడని బంధువులు తెలిపారు. రవీంద్ర గురువారం మెట్లు ఎక్కుతూ జారి కింద పడడంతో తలకు తీవ్రగాయం అయింది. అతడిని తిరుపతిలోని వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గ మధ్యలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య పల్లవి, 16నెలల కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య నాలుగు నెలల గర్భవతి అని తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడంపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. రహస్య ప్రదేశంలో ముళ్లపొదల్లో పేకాటస్థావరంపై దాడులు చేసి ఆరుగురిని అరెస్టుచేశామన్నారు. వారివద్ద నుంచి రూ. 14,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



పుట్టపర్తిలో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్‌కు బీజేపీ నాయకులు ఘననివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం దీన్‌దయాళ్ 109వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘననివాళులు అర్పించారు. నాయకులు తలుపుల గంగాధర్, సేవా పక్షోత్సవాల జిల్లా కన్వీనర్ రామమోహన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్యాణ్‌కుమార్, నాయకులు హరికృష్ణ, సాకే ఓబులేసు, జ్యోతి ప్రసాద్, సునీల్ వైట్ల తదితరులు పాల్గొన్నారు.

ఆత్మపరిశీలనతోనే మార్పు

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి

కదిరి లీగల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఆత్మపరిశీలన చేసుకుంటే మార్పు వస్తుందని, మంచిమనిషిగా మనుగడ సాగించగలరని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఎస్ రాజశేఖర్ అన్నారు. మార్పుతోనే మంచి మనిషిగా మనుగడ సాగించగలరన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి గురువారం కదిరి సబ్‌జైలు ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా న్యాయవిజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సబ్‌జైలులో ఖైదీలకు ఇస్తున్న ఆహారం, సరుకులను పరిశీలించారు.



జిల్లా కేంద్రంలో కాత్యాయనిగా సత్యమ్మ



ధర్మవరంలో మీనాక్షిదేవిగా వేదమాత గాయత్రి



కాత్యాయనిగా మామిళ్లకుంట లలితాదేవి

కోర్కెలు తీర్చే మీనాక్షి



కదిరిలో అన్నపూర్ణగా వాసవీమాత

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు ఆలయాల్లో అమ్మవారు మీనాక్షి దేవిగా దర్శనమిచ్చారు. ధర్మవరంలో వాసవీమాత, వేదమాత గా యత్రిదేవి, మండలంలోని ఉప్పునేసినప ల్లిలో కొల్హాపురమ్మను మీనాక్షి దేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే పట్టణం లోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అ మ్మవారు వెంకటేశ్వరస్వామిగా, గోరకాటి పెద్దమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. బత్తలపల్లిలో అమ్మవారిని దాక్షాయణిగా, క దిరిలో మరకత మహాలక్ష్మిని గౌరీదేవిగా, కుమ్మరవాండ్లపల్లి మ ల్లాలమ్మను కాత్యా యనిగా, తనకల్లులో కన్యకాపరమేశ్వరిని అన్నపూర్ణగా అలంకరించారు.

సొసైటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు సహకార బ్యాంకు చైర్మన్‌గా మేకల రామాంజినేయులు, సభ్యులుగా పోతుకుంట రవికుమార్, గొట్లూరు వెంకటేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బ్యాంకు వద్ద అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్, సభ్యులు సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. వారికి బ్యాంకు సీఈఓ నారాయణస్వామి, సిబ్బంది నరసింహారెడ్డి, నాగభద్ర, అపర్ణ శాలువాలు కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నాయకులు మహేష్‌చౌదరి శుభాకాంక్షలు తెలిపారు.

'సీఎంకు రమేష్ యాదవ్ క్షమాపణలు చెప్పాలి'



ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ చిత్రపటాలను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని హనుమాన్ కూడలిలో గురువారం టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రమేష్‌యాదవ్ చిత్రపటాలను దహనం చేశారు. ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు భీమినేని కిష్టప్ప, సాయికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలి'

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. 'సేవ్‌ఆర్డీటీ - ఆర్డీటీ పరిరక్షణ 'అనే కార్యక్రమంతో గురువారం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు డాక్టర్ ఆదిశేషు, సాకే వినయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న చిలకం మధు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు దోహదపడుతాయని అన్నారు. పట్టణంలోని 22, 30, 36వార్డులకు లబ్ధిదారులకు కొత్త పేటలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరై లబ్దిదారులకు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మొక్కలు నాటిన అధికారులు



గోరంట్లలో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు, నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్లాలచెరువు ఆంజనేయస్వామి ఆలయం వద్ద కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి గురువారం అధికారులు శ్రీకారం చుట్టారు. కార్యక్రమాన్ని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించాల్సి ఉండగా.. రాలేకపోయారు. దీంతో అధికారులు, నాయకులు ప్రారంభించారు. ఆలయం భూమిలో ఉపాధి పథకం కింద మొక్కలు నాటారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీలక్ష్మీ, ఏపీడీ శివానంద్‌నాయక్, ఎంపీడీఓ కమలాబాయి, ఏపీఓలు నాగిరెడ్డి, శ్రీకాంత్, టీడీపీ నాయకులు బాలక్రిష్ణచౌదరి, సోముశేఖర్, చంద్ర, మనోహర్, మూర్తి, నరసింహమూర్తి, ప్రకాష్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

● అమరాపురం: మండల పరిధిలోని నిద్రగట్ట గ్రామంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన కోటి మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ఎంపీడీఓ రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధమ్మ, లోకేష్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏపీఓ శివన్న, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ ఈరన్న, మాజీ సర్పంచ్ హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

రొద్దం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొద్దం పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. గురువారం రొద్దం సచివాలయం -1 వద్ద స్వచ్ఛతహీసేవ కార్యక్రమం ద్వారా సిబ్బందికి, క్లాప్‌మిత్ర, వాటర్‌మెన్‌లకు హెల్త్ చెకప్ చేయించి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్, ఈఓఆర్డీ గోవిందప్ప, నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, ఆంజనేయులు, వీరాంజనేయులు, రామచంద్ర, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

కనకదాస విగ్రహ ఏర్పాటుకు తరలిరండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

రొద్దం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న తిరుపతిలో జరగనున్న కనకదాస విగ్రహ ఏర్పాటు కార్యక్రమానికి మండలంలోని కురుబ కులస్థులు తరలి రావాలని సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం రొద్దంలోని రుద్రపాదాశ్రమం వద్ద కురుబ సంఘం ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సహకారంతో ఏర్పాటు చేస్తున్న విగ్రహ ఏర్పాటుకు మండలంలోని కురుబ కులస్థులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, సర్పంచ్ మంజు, మోపర్లపల్లి మంజు, ఆంజనేయులు, చెన్నకేశవులు, అశ్వర్థనారాయణ, మురళి, జయరాములు, లింగమయ్య, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

సోమందేపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిపర్తి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి గురువారం నాయకులు భూమిపూజ తెలిపారు. రూ.53 లక్షలతో ట్యాంకును నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మంత్రి సవిత అడిగిన తక్షణం స్పందించి నిధులు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, చంద్ర, వెంకటేశులు, అంజనేయులు, సిద్దలింగప్ప, భానుకీర్తి, సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, సూర్యనారాయణ, రామిరెడ్డి, అనిల్, బాలు, పరంధామ, రవికుమార్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

చిలమత్తూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వచ్చే గాలికుంటు వ్యాధిపట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి గాయత్రి పేర్కొన్నారు. గురువారం మండలంలోని శెట్టిపల్లి, కమ్మయ్యగారిపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తుగా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధిపై పాడి రైతులకు ఆమె అవగాహన కల్పించారు. గాలికుంటు వ్యాధి టీకాలు వేయిస్తే పాడి ఆవుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందన్న అపోహ ఉందని, అది నిజం కాదని అన్నారు. సాధారణంగా జ్వరంతో ఉన్న పశువులకు టీకాలు వేయడం వల్ల అవి కోలుకోవడానికి నాలుగైదు రోజులు పడుతుందన్నారు. దాంతో ఆ సమయంలో పశువులు పాల ఉత్పత్తి తగ్గిస్తాయన్నారు. ఆపోహతో టీకాలు వేయించకపోతే వ్యాధి ప్రాణాంతకంగా మారుతుందని తెలిపారు. అక్టోబరు 15 వరకు అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని పేర్కొన్నారు. మూడు నెలల లోపు, చూడి పశువులు మినహా మిగిలిన అన్నింటికీ టీకాలు వేస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పశువులకు టీకా వేయిస్తున్న పశువైద్యాధికారి గాయత్రి

పత్తి రైతులకు అపార నష్టం

● వికసించే దశలో వర్షాలు
● తడిసి దెబ్బతిన్న పంట

అమరాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి రైతులకు అపార నష్టం వాటిల్లుతోంది. మండలంలో చాలామంది రైతులు గత పదేళ్లగా వాణిజ్య పంట అయిన పత్తి సాగుపై మొగ్గుచూపుతున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 50 శాతం మంది రైతులు అధికంగా పత్తి పంటను సాగుచేశారు. అతివృష్టి అనావృష్టికారణంగా ప్రతియేటా పత్తి పంట రైతులు ఆశించిన ఫలితాలు రాక నష్టపోతున్నారు.





వర్షానికి దెబ్బతిన్న పత్తి చేను, తడిసిన పత్తిని ఆరబెట్టిన రైతులు

కూలీల కొరతతో సతమతమై ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు ఒక్క మహిళా కూలీకి రూ.500 నుంచి రూ.600, వారి రాకపోకల ఖర్చుకూడా భరించాల్సి వస్తోంది. సమీపంలో కూలీలు దొరక్క 16 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాల నుంచి ఆటోలో తరలించి పనులు చేయిస్తున్నారు. పత్తి వికసించే సమయంలో వర్షాలు పడటంతో తడిసి ముద్దగా మారుతోంది. దీంతో అందులో ఉన్న విత్తనాలు కుళ్లిపోయి నష్టం వాటిల్లిందని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 6నుంచి 8 క్వింటాళ్లు వచ్చే పత్తి ఈ యేడాది సగం కూడా రావడంలేదని పత్తి రైతులు వాపోతున్నారు. మార్కెట్ సౌకర్యాలు కూడా సుదూర ప్రాంతంలో ఉండటంతో ఇబ్బందికరంగా ఉందని అంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మడకశిర ప్రాంతంలో పత్తి మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నష్టపోయిన పంటలకు బీమా కల్పించాలని రైతులు కోరుతున్నారు.

వివిధ రూపాల్లో దుర్గామాత దర్శనం



పాండురంగస్వామి అలంకరణలో పేట వెంకటరమణస్వామి



కామాక్షి దేవి అలంకరణలో గాయత్రిదేవి



కాత్యాయని అలంకరణలో యల్లమ్మదేవి



కాత్యాయని అలంకరణలో లేపాక్షి దుర్గాదేవి

హిందూపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోత): దసరా శరన్నవరాత్రి వేడుకలు పురస్కరించుకుని నాలుగోరోజు గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని నింకంపల్లిరోడ్డులో ఉన్న యల్లమ్మదేవి కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమివ్వగా కామాక్షిదేవిగా గాయిత్రిదేవి దర్శనమిచ్చారు. పేట వెంకటరమణస్వామి విఠుల పాండురంగస్వామి అలంకరణలో దర్శనమిచ్చారు.

● లేపాక్షి : శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవిని కాత్యాయనీ రూపంలో అలం కరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

● పెనుకొండ : దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయిత్రిమాత రూపంలో అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గాయత్రీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి

పరిసరాలను శుభ్రం చేసిన అధికారులు

పలుచోట్ల స్వచ్ఛతా హీసేవ కార్యక్రమాలు



సోమందేపల్లిలో పాల్గొన్న అధికారులు

సోమందేపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతహీసేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సాయినగర్‌లో మండల అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. గురువారం ఏక్ దిన్ ఏక్ ఘంట నినాదంతో కాలనీలో పేరుకుపోయిన చెత్తను పరకపట్టి ఊడ్చారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నర్సింగరావు, ఎంఈఓ ఆంజనేయులునాయక్, వైద్యులు ఓంకార్, ఆర్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ జగదీష్ పాల్గొన్నారు.

● పరిగి : స్వచ్ఛతహీసేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ రెడ్డప్పల ఆధ్వర్యంలో చెత్తను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, ఏపీఎం రామేశ్వర్‌రెడ్డి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

● మడకశిర రూరల్: మండలంలోని బుళ్లసముద్రం పంచాయతీ కేంద్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యమంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కృష్ణానాయక్, ఎంపీడీఓ సోనీబాయి, సర్పంచు రంగమ్మ, కార్యదర్శి రమేష్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సతీదేవి, నాయకులు నరసయ్య పాల్గొన్నారు.

● పెనుకొండ రూరల్ : నగర పంచాయతీ ఇస్లాపురంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి, కమిషనర్ సతీష్‌కుమార్, కౌన్సిలర్ హనుమంతు, కన్వీనర్ శ్రీరాములు పాల్గొన్నారు.

● అమరాపురం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో స్వచ్ఛతహీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, పంచాయతీ కార్యదర్శులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

● పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం గ్రామంలో నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏక్ దిన్ ఏక్‌ఘంట ఏక్‌సాథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

రొద్దం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. గురువారం మండలంలోని గౌరాజుపల్లిలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వ్యవసాయ యాజమాన్య పద్దతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందు తక్కువ మోతాదులో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రాజేష్, ఏఈఓ హంసవేణి పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

సోమందేపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్నేహలతనగర్‌లో గురువారం స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. మహిళలు బ్రస్ట్‌క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపైవివరించారు. అనంతరం పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, సిబ్బంది, నాయకులు బాబయ్య, లక్ష్మీనారాయణ, అంజినరెడ్డి, పరంధామ, మురళి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

అగళి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులు, నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫీల్డ్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వర్ తెలిపారు. 18-30 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలని తెలిపారు. కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్‌ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించి సర్టిఫికెట్లను అందజేసి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. అక్టోబరు 1నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు సెల్ నెంబరు 6305334287ను సంప్రదించాలన్నారు.

అజ్జయ్యస్వామి ఆలయంలో పూజలు

గుడిబండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళికెర, ఎస్ రాయాపురం, గుడిబండ తదితర గ్రామాల్లో వెలసిన అజ్జయ్యస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అజ్జయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

చోరీలపై చర్యలు తీసుకోండి



సీఐకి వినతిపత్రం అందిస్తున్న మహిళా సంఘం నాయకులు

పావగడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా అనేక చోట్ల చోరీలు రోజు రోజుకు అధికమవుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మానవహక్కుల అవినీతి నిరోధక సంస్థ మహిళా సంఘం నాయకులు గురువారం సీఐ సురేష్ వినతి పత్రం అందించారు. ఇటీవల యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రజా పనులశాఖాధికారులు అక్కడక్కడ స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఒంటరి మహిళలను టార్గెట్‌చేసి చైన్‌స్నాచింగ్‌లు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు పోలీసులు నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఇమ్రాన్, నాగమణి, శశికళ, నేత్రావతి, శృతి, కీర్తి, రమ్య, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

ఇతర కులాలను వాల్మీకుల్లో చేర్చొద్దు

పావగడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇతర కులాలను వాల్మీకి కులంలో విలీనం చేయొద్దని పావగడ వాల్మీకి జాగృతి వేదిక ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు పాళెగారు లోకేష్ మాట్లాడుతూ.. వాల్మీకి జాబితాలోకి ఇతరకులాలను కలిపి నిజమైన వాల్మీకులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఓంకార్ నాయక్, శివకుమార్, నాగరాజు, మణిఓంకార్, రామాంజి పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

హిందూపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గురువారం కిరికెర గేటులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ వీరయ్య, టీడీపీ మండల కన్వీనర్ హెచ్‌ఎన్ రాములు కార్డుదారులకు స్మార్ట్‌కార్డులు అందజేశారు. పట్టణ పరిధిలోని నింకంపల్లిలో మున్సిపల్ చైర్మన్ రమేష్ స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ హారతి, డీలర్ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు అరుణాచల్‌రెడ్డి,శ్రీరామప్ప, అంజినరెడ్డి, అంజి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

● రొద్దం: స్థానిక సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, టీడీపీ నాయకులు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్, ఈఓఆర్డీ గోవిందప్ప, నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, ఆంజనేయులు, వీరాంజనేయులు, రామచంద్ర పాల్గొన్నారు.

● పరిగి: మండలకేంద్రంలో వేణురెడ్డి స్టోర్ వద్ద తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. నాయకులు గోవిందరెడ్డి, సోమప్ప, సంజీవరాయప్ప పాల్గొన్నారు.

●సోమందేపల్లి : మండలంలోని మాగేచెరువులో అధికారులు, నాయకులు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, తహసీల్దార్ మారుతి, వీఆర్‌ఓ రామాంజినేయులు, నాయకులు డీవీ ఆంజనేయులు, చంద్ర, వెంకటేశులు, సిద్దలింగప్ప, నరసింహులు పాల్గొన్నారు.

● గోరంట్ల : పట్టణంలోని వంకవీధి, రాజీవ్‌కాలనీల్లోని రేషన్ షాపుల వద్ద స్మార్ట్‌రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. క్యాక్రమంలో సీఎస్‌డీటీ శ్రీధర్, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

● అగళి : మండలంలోని ఆర్జీపల్లిలో లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావు, ఆర్‌ఐ చంద్రశేఖర్‌రావు, సర్పంచ్ సన్నమ్మ, ఎంపీటీసీ చంద్రప్ప పాల్గొన్నారు.

● పెనుకొండ రూరల్ : మండలంలోని సచివాలయ వద్ద స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరప్రసాద్, శ్రీరాములు, సిద్దయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

● రొళ్ల : మండలంలోని దొడ్డేరి పంచాయతీలో స్మార్ట్‌కార్డులను తహసీల్దార్ షెక్షావలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, డీలర్ల సంఘం అధ్యక్షుడు ఉమేష్ పాల్గొన్నారు.



స్మార్ట్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే పీఏ వీరయ్య

పాత డంపింగ్‌యార్డ్‌ను శుభ్రం చేయండి: కలెక్టర్



డంపింగ్‌యార్డ్ వద్ద కలెక్టర్ శాంప్రసాద్ తదితరులు

హిందూపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మోతుకపల్లివద్ద ఉన్న పాత డంపింగ్ యార్డ్‌ను రీసైక్లింగ్‌చేసి వెంటనే శుభ్రం చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి మున్సిపల్ కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ 73 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, 45 ఏళ్లగా డంపింగ్‌యార్డ్ ఉన్నందున చెత్త పేరుకుపోయిందన్నారు. అక్టోబరు 5నాటికి శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ వెంకటేశ్, నాయకులు నాగరాజు, డైమండ్ బాబా, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, గంగాధర్, ముంతాజమ్మ, నాగరాజు, శంకర్, హరీష్, పార్వతీబాయి, శాంతమ్మ పాల్గొన్నారు.

● అగళి : పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు గురువారం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు విక్టోరియారాణి, రంగేగౌడ్, మంజునాథ్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం నియంత్రణకు చర్యలు తీసుకోండి : డీసీ

పెనుకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో అక్రమ మద్యం ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. గురువారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్ డీసీ నాగమద్దయ్య, ఏఈఎస్ నరసింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మద్యం వ్యాపారులు సమయపాలన పాటించాలని, కర్ణాటక మద్యంపై కేసులు నమోదుచేయాలన్నారు. సమావేశంలో సీఐ సృజన్‌బాబు, ఎస్‌ఐలు రాజశేఖర్, రాముడు, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



పారిశుధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిలమత్తూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల ఆరోగ్యాలను కాపాడే ప్రయత్నం చేసే పారిశుధ్య కార్మికులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో ఆయుష్ వైద్యురాలు రోజా, ఆరోగ్య సిబ్బంది చిలలమత్తూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జయచంద్రకుమార్, కార్యదర్శి నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలను పరిశీలించండి : ఆర్డీఓ

రొద్దం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాల పరిశీలన వేగవంతం చేయాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆదేశించారు. గురువారం రొద్దం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బూత్‌లవారీగా ఓటరు జాబితా పేర్లు, తప్పొప్పులు, చేర్పులు తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా పరిశీలన నిశితంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

12.6 టన్నుల యూరియా దిగుమతి

అమరాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి 12.600 టన్నుల యూరియా దిగుమతి అయినట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో యూరియా కొరతలేకుండా ప్రతి రైతుకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విరుపసముంద్రం మంజునాథ్, మీసేవా, ఆధార్‌సెంటర్ నిర్వాహకులు నిరంజన్, కెంకెర టీడీపీ నాయకులు భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

గోరంట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టిపల్లి తండాకు చెందిన వివాహిత గాయత్రిబాయి క్రిమిసంహారక మందు తాగి గురువారం ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ తగాదాల కారణంగా ఆమె పంట పొలాలకు ఉపయోగించే పురుగు మందు తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ తేజశ్వని చికిత్సలు చేశారు. మెరుగైన చికిత్సకోసం 108 లో హిందూపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

అత్యవసర పనులపై దృష్టి

చిలమత్తూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అత్యవసరమైన పనులపై దృష్టి పెట్టి త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొడికొండ పంచాయతీలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు చేపడతామన్నారు. ప్రధానంగా గ్రామాల్లో డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి అవసరాలలో ప్రాధాన్యతను గుర్తించి పనులు చేపడతామని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో తాను గ్రామాల్లో పర్యటిస్తున్నానని, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళతానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, గోవిందప్ప, షఫీవుల్లా పాల్గొన్నారు.